

http://amaravathivelugu.com

RNI No. : APTEL/2022/85169

అమరావతి తెలుగు

సంచలన తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను

పాత్రికేయులుగా పని చేయాలన్న ఉత్సాహం
మీ ప్రాంత స్థితిగతులపై అవగాహన
తెలుగులో రాయగలిగిన భాషా పరిజ్ఞానం ఉన్న
ఔత్సాహికులకు ఇదే మా ఆహ్వానం

అనంతపురం జిల్లా వ్యాప్తంగా మండల కేంద్రాల్లో
న్యూస్ కంట్రిబ్యూటర్లు కావలెను.
విషయ పరిజ్ఞానంతో పాటు సామాజిక,
రాజకీయ అవగాహన కలిగి స్థానికులై ఉండాలి.
వివరాలకు సంప్రదించండి :
జానపాటి వెంకట రమేష్ బాబు ఎడిటర్
9440814576

సంపుటి : 04 సంచిక : 178 ప్రచురణ : శ్రీ సత్యసాయి/అనంతపురం ఎడిటర్ : జానపాటి వెంకట రమేష్ బాబు గురువారం, అక్టోబరు 29, 2026 పేజీలు : 4 వెల : ₹2/-

Circulated at Guntur, Palnadu, Bapatla, Chittoor, Tirupati, Madanapalli, Kurnool, Nandyal, Visakapatnam, Vijayawada, Kadikana, Kadapa, Nellore, Rajamendravaram



కాంగ్రెస్‌పై మోదీ...

సెటైర్..!!

బ్యాలెట్ పేపర్‌తో ఎన్ని సీట్లు వచ్చాయంటూ పోస్ట్


కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికలపై ప్రధాని మోదీ స్పందించారు. ఈ నాలుగు రాష్ట్రాల శాసన మండలి ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కకపోవడంతో ఆయన సోషల్ మీడియా యాప్ ఎక్స్ వేదికగా సెటైర్ వేశారు. 'బ్యాలెట్ పేపర్‌తో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నిసీట్లు గెలిచింది..?' అంటూ ప్రధాని చురకలంటించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎమ్) ద్వారా కాకుండా బ్యాలెట్ పేపర్‌లతో మాత్రమే ఎన్నికలు నిర్వహించాలని గత కొంతకాలంగా కాంగ్రెస్ డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ తరుణంలో బ్యాలెట్ పేపర్‌తో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఎన్నిసీట్లు సాధించిందంటూ మోదీ ఎద్దేవా చేశారు. కాగా ఉత్తర్ ప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని 28 శాసన మండలి స్థానాలకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని మూటకట్టుకుంది. ఒక్కస్థానాన్ని కూడా గెలవలేకపోయింది. అధికారంలో ఉన్న కర్ణాటకలోనూ ఒక్క సీటు కూడా పొందలేదు. ఈ నేపథ్యంలో ఆ పార్టీపై ప్రధాని మోదీ సెటైర్ వేశారు.

తుపాను వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికీ...

న్యాయం చేస్తాం..!!

"అర్నబ్ తుపానుపై మూడు రోజులుగా నిరంతర సమీక్షలు చేశాం

- తీవ్రత గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాం
- పరిస్థితులకు అనుగుణంగా అధికారులను సన్నద్ధం చేశాం
- ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ పనిచేశాం
- సేఫ్, సెక్యూరిటీ, రిహాబిలిటేషన్ అనుసరిస్తూ ముందుకెళ్లాం
- గతంలో తుపానుల వల్ల చాలామంది చనిపోయేవారు
- కానీ ఈ తుపాను ప్రభావంతో ఐదుగురే చనిపోయారు...
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను
- మృతుల కుటుంబాలకు రూ.5లక్షల సాయం..
- ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.10 వేల ఆర్థిక సాయం
- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అమరావతి: అర్నబ్ తుపానుతో పంట, ఆస్తి నష్ట పోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆంధ్రప్ర దేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడారు. "అర్నబ్ తుపానుపై మూడు రోజులుగా నిరంతర సమీక్షలు చేశాం. తీవ్రత గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాం. పరిస్థితులకు అనుగుణంగా అధికారులను సన్నద్ధం చేశాం. ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ పని చేశాం. సేఫ్, సెక్యూరిటీ, రిహాబిలిటేషన్ అనుసరిస్తూ ముందుకెళ్లాం" అని చెప్పారు. "గతంలో తుపానుల వల్ల చాలామంది చనిపోయేవారు. కానీ ఈ తుపాను ప్రభావంతో ఐదుగురే చనిపోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మంగళవారం రాత్రి 11.15 గంటలకు అర్నబ్ తుపాను తీరాన్ని తాకింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ నుంచి పక్క రాష్ట్రాలకు వెళ్లింది. దీని ప్రభావంతో ఇంకా కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వాతావరణం అనుకూలించక సహాయక చర్యలు ఆలస్యమవుతున్నాయి. ఆ రెండు జిల్లాలు తప్ప అన్ని జిల్లాల్లో సాయంత్రానికి విద్యుత్తు పునరుద్ధరిస్తాం. గురువారం సాయంత్రం వరకు శ్రీకాకుళం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని సీఎం సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.5లక్షల సాయం..

"తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. శిబిరాల్లోని బాధితులకు రూ.1000 చొప్పున రూ.మూడు వేల వరకు సాయం చేస్తాం. కిరాణా దుకాణాలు, రెస్టరంట్లు దెబ్బ తింటే రూ.25 వేలు, రూ.40 లక్షల లోపు టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర లోపు టర్నోవర్ ఉన్న వాటికి రూ.లక్ష, రూ.కోటిన్నరకు పైగా టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.1.5 లక్షల సాయం అందిస్తాం. ద్విచక్ర వాహనం దెబ్బతింటే రూ.3 వేలు, త్రిచక్ర వాహనానికి రూ.10 వేల సాయం, దెబ్బతిన్న ఫిషింగ్ బోట్లకు రూ.9 వేలు, వలల మరమ్మతులకు రూ.5 వేలు, వలలు ఉన్న ఫిషింగ్ బోటు దెబ్బతింటే రూ.25 వేల సాయం చేస్తాం" అని చంద్రబాబు తెలిపారు.



అర్నబ్ తుపాను బీభత్సం..!!

వేర్వేరు జిల్లాల్లో ఏడుగురి మృతి

ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసం

అర్నబ్ ముప్పు తొలగే వరకు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత

అర్నబ్ తుపాను ఉభయగోదావరి జిల్లాలతో పాటు, ఉత్తరాంధ్రలో బీభత్సం సృష్టించింది. ఈదురుగాలుల తీవ్రతకు పలు చోట్ల చెట్లు, విద్యుత్తు స్తంభాలు కూలి న ఘటనల్లో ఏడుగురు మృతి చెందారు. విశాఖ పాత గోశాల సమీపంలో విద్యుత్తు స్తంభం కూలి మహిళ మృతి చెందగా, విశాఖ ..2వ పేజీలో




స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలు ఒకే జట్టుగా...

పనిచేయాలి..!!

సీఎం చంద్రబాబు పిలుపు

- సుపరిపాలన నినాదంతో మూడు పార్టీలు కలిసి 2024లో ఎన్నికలకు వెళ్లాం
- ప్రజలు విశ్వసించి ఎన్డీఏకు చరిత్రాత్మక విజయాన్ని అందించారు..
- ప్రజల నమ్మకానికి అనుగుణంగానే పాలన అందిస్తున్నాం...
- 3 పార్టీల కార్యకర్తలు సార్వత్రిక ఎన్నికల్లో ఒకే మాట-ఒకే బాట అన్నట్టుగా పని చేశారు
- ఎన్నికల సమయంలో ఒక పార్టీలోనే అనేక ఇబ్బందులు ఉంటాయి..
- రాష్ట్రం కోసం ఆ చిన్నచిన్న సమస్యలను అధిగమించాలని నేతలకు తెలిపారు



అమరావతి : టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన 45 వేల మంది నేతలు, కార్యకర్తలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సుపరిపాలన నినాదంతో మూడు పార్టీలు కలిసి 2024లో ఎన్నికలకు వెళ్లామని.. ప్రజలు విశ్వసించి ఎన్డీఏకు చరిత్రాత్మక విజయాన్ని అందించారని తెలిపారు. ప్రజల నమ్మకానికి అనుగుణంగానే పాలన అందిస్తున్నామన్నారు. చెప్పినట్లుగానే సుపరిపాలన అందిస్తున్నామని అన్నారు. 3 పార్టీల కార్యకర్తలు సార్వత్రిక ఎన్నికల్లో ఒకే మాట-ఒకే బాట అన్నట్టుగా పని చేశారని చెప్పుకొచ్చారు. **వారికీ అవకాశం ఇస్తాం...** ఎన్నికల సమయంలో ఒక పార్టీలోనే అనేక ఇబ్బందులు ఉంటాయని సీఎం అన్నారు. ఇప్పుడు కూటమిలో మూడు పార్టీలు ఉన్నప్పుడు సమస్యలు కూడా ఉంటాయని.. అయితే రాష్ట్రం కోసం ఆ చిన్నచిన్న సమస్యలను అధిగమించాలని నేతలకు తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ఏ విధంగా కలిసి పని చేశారో... అదే విధంగా స్థానిక ఎన్నికల్లోనూ 3 పార్టీలు ఒకే జట్టు అన్నట్టు ఉండాలని పిలుపునిచ్చారు. పార్టీ అధినేతలంతా కూర్చొని సీట్లపై క్లారిటీ ఇచ్చామని... దానికి తగ్గట్టుగా కూటమి కార్యకర్తలు పని చేయాలని తెలిపారు. ఇప్పుడు సీట్లు రాని వారికి నామినేటెడ్ పదవులు, ఛైర్మన్ పదవుల ద్వారా అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్డీఏ నిర్ణయించిన అభ్యర్థులకే మద్దతు తెలిపాలని... వారి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. రెబల్స్, స్వతంత్రులుగా పోటీలో ఉండటానికి వీల్లే దని...ఇది కూటమి ధర్మానికి విరుద్ధమన్నారు.





కూటమి ప్రభుత్వం పట్ల ప్రజల్లో సంతృప్తి..

స్థానిక సంస్థల ఎన్నికలను అడ్డుకునేందుకు గౌడలి పార్టీ 62 పిటిషన్లు వేసి సుప్రీంకోర్టు వరకూ వెళ్లిందని ముఖ్యమంత్రి విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఎన్నికలను వాయిదా వేయడానికి అంగీకరించలేదన్నారు. అర్నబ్

సహాయక చర్యల్లో

పాల్గొనండి



జన సైనికులకు పవన్ విజ్ఞప్తి

- కోస్తా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపించింది
- చాలా చోట్ల ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి...
- తుపాను తీరం దాటినా వర్షాలు భారీగా కురుస్తాయి
- బాధితులను సహాయక శిబిరాలకు తరలించి ఆహారం అందించాలి
- కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపులో సిబ్బందికి సహకరించాలి

అమరావతి: అర్నబ్ తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని సహాయక చర్యల్లో పాలు పంచుకోవాలని జనసైనికులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. కోస్తా జిల్లాలపై తుపాను తీవ్ర ప్రభావం చూపించిందని, చాలా చోట్ల ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని పవన్ తెలిపారు. తుపాను తీరం దాటినా వర్షాలు భారీగా కురుస్తాయని వాతావరణశాఖ చెప్పిందన్న ఆయన.. తుపాను బాధితులను సహాయక శిబిరాలకు తరలించి ఆహారం అందించాలని సూచించారు. రహదారులపై కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాల తొలగింపులో సిబ్బందికి సహకరించాలని ఓ ప్రకటనలో డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

ఏపీ స్థానిక ఎన్నికల్లో 410 కోడ్..

ఉల్లంఘన కేసులు..!!

నివేదిక విడుదల...



..2లో..

స్థానిక ఎన్నికల్లో కూటమి నేతలు ఒకే జట్టుగా పనిచేయాలి..!!

(మొదటిపేజీ తరువాయి) తుఫాన్ ప్రభావం రాష్ట్రంపై గట్టిగా ఉందని.. రాష్ట్రంలోని తుఫాన్ పరిస్థితిని కేంద్రమంత్రి అమిత్ షాకు వివరించినట్లు చెప్పారు. రెండ్రోజులుగా తుఫాన్‌పై సమీక్షిస్తూనే మరోవైపు పార్టీకి సమయం కేటాయిస్తున్నామన్నారు. మూడు పార్టీల నేతలు చర్చించుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్ల కేటాయింపులు జరిపామని అన్నారు. ప్రజల్లో కూటమి ప్రభుత్వం పట్ల సంతృప్తి ఉందని.. కేలండర్ ప్రకారం సంక్షేమం ఇస్తున్నామన్నారు. డీఎస్సీ నిర్వహించామని.. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చామని చెప్పారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించామని, గుంతలు లేని రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం బటన్లు నొక్కుతున్నామంటూ అభివృద్ధి కార్యక్రమాలను పక్కన పెట్టిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూటమికి వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు రావాలని అన్నారు.

అదే స్ఫూర్తితో పనిచేయండి... ఓట్ షేర్ పెరగాలని.. స్ట్రైక్ రేట్‌లో దూసుకెళ్లాలని చంద్రబాబు వెల్లడించారు. మూడు పార్టీల కార్యకర్తలు గతంలో ఎవరు అభ్యర్థి అనేది



చూడకుండా ఓటువేసి గెలిపించారని గుర్తుచేశారు. మనసు పెట్టి పని చేశారని... ఇప్పుడూ అదే స్ఫూర్తితో పని చేయాలని సూచించారు. గొడ్డలి పార్టీ చతికల పడిందని... బెంగళూరులో కూర్చొని కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. హిట్ అండ్ రన్ మాదిరి, తీవ్రవాది తరహాలో జగన్ ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. గొడ్డలి పార్టీ అధినేత ధ్యాసంతా ప్యాలెస్‌లు, ఆస్తులపైనే ఉందని వ్యాఖ్యానించారు. ఆస్తులు కూడబెట్టుకునే పనిలో గొడ్డలి పార్టీ అధ్యక్షుడు చాలా బిజీగా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. ఆ పార్టీ అరాచకాలను, ఆకృత్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. వైసీపీ ఓటు బ్యాంక్ ఇప్పటికే తగ్గిపోయిందని... అది ఇంకా తగ్గుతుందన్నారు. రాష్ట్రం బాగు కోసం మరింత తగ్గాలని తెలిపారు. 'మనం ప్రజల కోసం నిబద్ధతగా పని చేస్తున్నాం. అవతలి వారు గాలికి ఎలా తిరుగుతున్నారో అందరూ చూస్తూనే ఉన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలో కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ బలంగా ఉండాలి. కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు అన్నీ మనమే గెలవాలి. ఇప్పుడు డబుల్ ఇంజిన్ సర్కారులో ఉన్నాం... ట్రిబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి. తక్కువ సమయమే ఉంది..ఈ వారం పాటు చురుగ్గా పని చేయాలి' అంటూ టెలికాన్ఫరెన్స్‌లో నేతలకు చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

ఏపీ స్థానిక ఎన్నికల్లో 410 కోడ్... ఉల్లంఘన కేసులు..!!

నివేదిక విడుదల

విజయవాడ : ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం నేటి నివేదికను విడుదల చేసింది. దాని ప్రకారం



ఈరోజు(బుధవారం) 410 ఎన్నికల కోడ్ (వీజజ ।ూ/1దీ) ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. అలాగే రాష్ట్రంలో నేడు 7 ఎఫ్ఐఆర్‌లను పోలీసులు నమోదు చేశారు. ఇవాళ 47 ఆయుధాలను అధికారులు డిపాజిట్ చేసుకున్నారు. ఈ ఒక్కరోజే బీఎన్ఎస్ సెక్షన్లు 126, 129 కింద 846 బైండోవర్ కేసులు నమోదు అయ్యాయి. కాగా ఈ నివేదిక ప్రకారం.. అక్టోబర్ 15 నుండి 28 వరకు నమోదైన మొత్తం ఎఫ్ఐఆర్‌ల సంఖ్య 251గా ఉంది. ఈ కాలవ్యవధిలోనే మొత్తం 33,505 ఎంసీసీ (వీజజ ।ూ/1దీ) ఉల్లంఘన కేసులు నమోదయ్యాయి. ఇప్పటివరకు 107 మంది వ్యక్తులు అరెస్ట్ అయ్యారు. అలాగే 9,264 ఆయుధాలను అధికారులు డిపాటిట్ చేసుకున్నారు. కాగా ప్రస్తుతం పనిచేస్తున్న స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌ల సంఖ్య 814గా ఉందని నివేదిక చెబుతోంది.

బలహీనపడిన అర్నబ్..!

ఈ రోజు రాత్రికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం

అమరావతి: అతి తీవ్ర తుపాను అర్నాబ్.. తుపానుగా బలహీనపడిందని, ఈ రోజు రాత్రికి క్రమంగా తీవ్ర వాయుగుండంగా మారనుందని వాతావరణ కేంద్రం అధికారులు



తెలిపారు. దీని ప్రభావంతో గురువారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీవర్షాలు.. మిగిలిన చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు. భారీ వర్షాలతో ఫ్లాష్ ఫ్లడ్స్ వచ్చే అవకాశం ఉన్నందున.. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. డోప్లర్ వెదర్ రాడార్ ద్వారా తుపాను గమనాన్ని అధికారులు పరిశీలిస్తున్నారు.

ప్రతిదాన్నీ రాజకీయం చేయడం మానుకోండి...

రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్

దిల్లీ: టాటా గ్రూప్ వ్యవహారంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ (చీఱతీఎఱశ్రీఱ ూఱ్‌ష్ట్రుతీఱఎఱఅ) తప్పుబట్టారు. ప్రతిదాన్నీ



రాజకీయం చేయాలని చూడొద్దని హితవు పలికారు. విద్వేషాలను రెచ్చగొట్టే విషయంలో తనతో కలిసి రావాలని వ్యాపారవేత్తలను ఉసిగొల్పేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారని, ఏ వ్యాపారీ మాట్లాడే ధైర్యం కూడా చేయలేకపోతున్నారంటూ రాహుల్ గాంధీ విమర్శలపై నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా స్పందించారు. పరిశ్రమలను, పారిశ్రామికవేత్తల విజయాలను రాహుల్ గాంధీ పదేపదే తక్కువ చేసి చూస్తున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం పరిశ్రమలను ఉద్యోగ సృష్టికర్తగా, ఆర్థిక వృద్ధి చోదకంగా పరిగణిస్తుందని అన్నారు. వ్యాపారాలను, పెట్టుబడులను ప్రోత్సహించడం, పరిశ్రమకు మద్దతు ఇవ్వడం తమ విధానమని పేర్కొన్నారు. "ప్రతిపక్ష నేతగా మీరు ప్రతి అంశాన్ని రాజకీయం చేయొద్దు. వాణిజ్య, న్యాయపరమైన అంశాలను నేరపూరితమైనవిగా ముద్ర వేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత పరిశ్రమ, మన పారిశ్రామికవేత్తల విజయాలను పదేపదే విమర్శించారు. ఇప్పుడు, అవనమ్మకాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేయడంలో కలిసి రావాలని వ్యాపారవేత్తలను రెచ్చగొడుతున్నారా? లైసెన్స్- కోటా రాజ్ పేరుతో దశాబ్దాల పాటు మీ పార్టీ పారిశ్రామిక వేత్తల స్ఫూర్తిని అణచివేసింది. కోట్లాది మంది భారతీయులపై పేదరికాన్ని రుద్దింది" అని నిర్మలా సీతారామన్ విమర్శించారు. "మీ సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం ఆరోపణలు చేయడం మానుకోవాలి. నిర్మాణాత్మకంగా వ్యవహరించండి. భారత రాజ్యాంగం తన పౌరులందరికీ న్యాయం జరిగేలా చూస్తుంది. దాన్ని పరిరక్షించే బాధ్యత మన గౌరవనీయ న్యాయస్థానాలకు అప్పగించింది. మీరు, మీ పార్టీ, మీ పార్టీకి చెందిన ప్రధానులు న్యాయవ్యవస్థను ఎంత నీచంగా కించపరిచారో అనడానికి చరిత్రే సాక్ష్యం. కాబట్టి ప్రతిచోటా దెయ్యాలను చూడడం మానుకోండి" అని గట్టిగా చెప్పారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్ చంద్రశేఖరన్‌ను నియమించడాన్ని టాటా ట్రస్టుల ఛైర్మన్ నోయల్ టాటా ఇటీవల సవాలు చేశారు. ఈ నేపథ్యంలో టాటా గ్రూప్‌ను కావాలనే నాశనం చేస్తున్నారని, ఇతర పారిశ్రామిక వేత్తలెవరూ స్పందించడం లేదంటూ రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

నం.1 ఎంట్రీ ఎప్పుడు?: రాహుల్ గాంధీ

నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ స్పందించారు. రెండు ప్రశ్నలు సంధించారు. హోం మంత్రి అమిత్ షా నివాసంలో టాటా ట్రస్ట్స్, టాటా సన్స్‌కు ఏ ప్రాతిపదికన ఆతిథ్యం ఇచ్చారని ప్రశ్నించారు. ఈ గేమ్‌లోకి క్రోనీ నం.1 ఎప్పుడు ప్రవేశించబోతున్నారు? ఆయనకు ఏ టాటా సంస్థను కట్టబెట్టబోతున్నారు? అని ప్రశ్నించారు. ముగ్గురు, నలుగురు సన్నిహితులు మినహా ఇప్పటికే మిగిలిన వ్యాపారవేత్తలు మిమ్మల్ని ద్వేషిస్తున్నారని, వారికి మళ్లీ ప్రేరణ అవసరం లేదంటూ ఎక్స్‌లో పేర్కొన్నారు. నిర్మలా సీతారామన్‌ను డియర్ సీతారామా అని సంబోధించారు.

అర్నబ్ తుపాను బీభత్సం..!!

(మొదటిపేజీ తరువాయి)

బాలాజీనగర్‌లో విద్యుత్ స్తంభం కూలి కె.మాధవి దుర్మరణం చెందారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. భీమవరంలోని చర్చి వద్ద చెట్టు విరిగిపడి చొక్కా కిషోర్(45) మృతి చెందగా, బొండాడవారివీధిలో విద్యుత్తు స్తంభం విరిగిపడి రాంబాబు (34) మృతి చెందారు. ఈదురుగాలుల ధాటికి భీమవరంలో దుకాణాలు, ఇళ్లు ధ్వంసమయ్యాయి. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలంలోని ప్రకాష్‌పురంలో వృద్ధురాలు మృతి చెందారు. అదే జిల్లాలో ఈదురుగాలులు, వర్షానికి గుడిసె కూలి కొల్లు వెంకాయమ్మ దుర్మరణం చెందారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలిలో ఈదురుగాలులకు విద్యుత్తు తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఉదయాన్నే ప్రమాదవశాత్తూ ఇంటి ముందు ఉన్న విద్యుత్తు తీగలు తగిలి మహిళ మృతి చెందారు.

అర్నబ్ ముప్పు తొలగే వరకు అప్రమత్తంగా ఉండాలి: హోంమంత్రి అనిత



అనకాపల్లి జిల్లా పాయకరావుపేట నియోజకవర్గంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం విస్తృతంగా పర్యటించారు. గడిచిన 24 గంటల్లో కురిసిన వర్షాలకు వరహానది ఉద్ధృతంగా ప్రవహిస్తుండడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించి, లోతట్టు గ్రామాల ప్రజల అప్రమత్తత, పునరావాస కేంద్రాలకు తరలింపుపై అధికారులతో చర్చించారు. పునరావాస కేంద్రాల్లో అందుతున్న సహాయక చర్యలపై ఆరా తీశారు. చిన్న గుమ్ములూరు, పెద్ద గుమ్ములూరు తదితర ప్రాంతాల్లో స్థానికులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలు చేపడుతున్న తీరుపై అధికారులను మంత్రి ప్రశంసించారు. అర్నాబ్ ముప్పు పూర్తిగా తొలగే వరకు అధికార యంత్రాంగం అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు కూడా తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు.

సంపాదకీయం

ఎల్‌నినోపై తెలంగాణ సర్కార్ ఫోకస్..

మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల స్థాయి సమన్వయ కమిటీలను నియమించింది.



రాష్ట్రంలో ఈ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు మండల సమన్వయ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జీవో ఆర్టీ నంబర్ -579ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జారీ చేసింది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో కమిటీలను ఏర్పాటు చేసింది. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పన, తాగునీటి భద్రత, పశుగ్రాసం అందుబాటుపై కమిటీలు ప్రత్యేక దృష్టిసారించనున్నాయి. 35,959 చిన్న నీటిపారుదల చెరువుల పరిధిలో పశుగ్రాసం సాగుకు అనువైన ప్రాంతాలను ఈ కమిటీలు గుర్తించనుంది. మహిళా స్వయం సహాయక సంఘాల భాగస్వామ్యంతో పశుగ్రాసం సాగును ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టనుంది. పశువులకు తాగునీటి కోసం కొత్త నీటి తొట్టెల నిర్మాణం, ఇప్పటికే ఉన్న తొట్టెల మరమ్మతులను చేయనుంది. వ్యవసాయ కుంటలు, చెక్‌డ్యామ్‌లు, బోర్‌వెల్ రీచార్జ్ నిర్మాణాల ద్వారా నీటి సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వనుంది. గ్రామీణ రహదారులు, కల్వర్టులు, అంగన్‌వాడీ, గ్రామపంచాయతీ భవనాలు, పశువుల షెడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టనుంది. ప్రతి గ్రామపంచాయతీలో అవసరమైన పనులను గుర్తించి వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలను రూపకల్పన చేయనుంది. మండల సమన్వయ కమిటీలు వారానికి కనీసం ఒకసారి సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించనుంది. వారంతపు నివేదికలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాలని ఆదేశించనుంది. ఆయా కమిటీల ఏర్పాటు, పనుల అమలుపై పర్యవేక్షణ బాధ్యత జిల్లా కలెక్టర్లకు తెలంగాణ ప్రభుత్వం అప్పగించనుంది.

పంజాబ్‌లో కాల్పుల కలకలం.. ఒకరి మృతి

పంజాబ్‌లో తాజాగా కాల్పుల కలకలం రేగింది. కారులో వెళుతున్న వారిపై ఇద్దరు వ్యక్తులు అకస్మాత్తుగా కాల్పులకు దిగడంతో ఒకరు మృతి చెందారు. తార్న్ తరణ్



జిల్లాలోని అసల్ ఉత్తర్ గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. మృతుడిని గురుసేవక్ సింగ్‌గా గుర్తించారు. ఈ ఘటనలో గాయపడ్డ హర్‌కిరత్ సింగ్, సాజన్ సింగ్‌లకు ఖికీవింద్ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం, థార్ ఎస్‌యూవీలో వచ్చిన ఇద్దరు నిందితులు వాహనం దిగి మరోకారులోని వారిపై కాల్పులు జరిపారు. నిందితుల్లో ఒకరిని మంజీత్ సింగ్ అలియాస్ కట్టాగా పోలీసులు గుర్తించారు. అతడిపై ఇప్పటికే పలు క్రిమినల్ కేసులు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. రెండో నిందితుడి వివరాలు మాత్రం ఇంకా తెలియాల్సి ఉంది. పట్టపగలు వీధిలో అందరూ చూస్తుండగా ఈ ఘటన జరగడంతో స్థానికంగా కలకలం రేగింది. నిందితులు ఎందుకు కాల్పులకు తెగ బడిందీ ఇంకా తెలియరాలేదు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుల పరిస్థితి గురించి కూడా తెలియాల్సి ఉంది. ఇటీవల ముంబైలో బాలీవుడు నటుడు టైగర్ ష్రాఫ్‌పై బిష్ణోయ్ గ్యాంగ్ సభ్యులు కాల్పులకు దిగడం దేశవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే.

తుఫాన్ తీరం దాటినా ముప్పు పోలేదు..

ఈ జిల్లాలకు భారీ వర్ష సూచన

'అర్నాబ్' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాలకు భారీ వర్ష సూచన జారీ చేశారు. గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు.



అమరావతి: 'అర్నాబ్' తుపాను వాయువ్య దిశగా కదులుతూ, రాత్రి 2 గంటల నుంచి ఉదయం 8 గంటల మధ్య బాపట్ల--విశాఖపట్నం మధ్య, యానాం తీరాలకు సమీపంలోని నరసాపురం వద్ద తీరం దాటినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. గత ఆరు గంటల్లో గంటకు 5 కిలోమీటర్ల వేగంతో కదిలిన తుపాను.. బుధవారం మధ్యాహ్నానికి బలహీనపడి, ఈ రాత్రికి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వెల్లడించారు.

మూడు జిల్లాలకు భారీ వర్ష సూచన.. తుపాను ప్రభావంతో గురువారం శ్రీకాకుళం, మన్యం, విజయనగరం జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవవచ్చని అంచనా వేశారు. గంటకు 40--50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. భారీ వర్షాల కారణంగా ఆకస్మిక వరదలు (ఫ్లాష్ ఫ్లడ్స్) సంభవించే ప్రమాదం ఉందని అధికారులు సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పొంగిపొర్లుతున్న వాగులు, కాలువలను దాటేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు.

పుట్టపర్తి అభివృద్ధికి కూటమి
కట్టుబడి ఉంది

: ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

అమడగూరు, అక్టోబరు28, అమరావతి వెలుగు : పుట్టపర్తి నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధి, ప్రజల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి








ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. నవంబరు 5న జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. బుధవారం అమడగూరు మండలంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. పుట్టపర్తి ప్రాంతంలో యుద్ధ విమానాల తయారీ కేంద్రం ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయని, అమడగూరు మండలంలో రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో రూ.50,300 కోట్ల పెట్టుబడితో 31,750 ఎకరాల్లో సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు కానుందని వివరించారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రైతులకు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. భూములను లీజుకు ఇచ్చే రైతులకు ఎకరాకు ఏడాదికి రూ.31 వేల చొప్పున ఆదాయం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. అమడగూరు మండలంలో సుమారు రూ.13.52 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి సదుపాయాలు, డ్రైనేజీలు, వాటర్ ప్లాంట్లు, ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పింఛన్ల పెంపు, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ వంటి పథకాలతో అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. గ్రామాల అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, యువతకు ఉపాధి కల్పన కోసం స్థానిక సంస్థల్లో సమర్థవంతమైన నాయకత్వం అవసరమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని కోరారు.

అగ్రిస్టాక్‌తో రైతులకు మెరుగైన...
మార్కెటింగ్ సౌకర్యాలు

నెల్లూరు, అక్టోబరు 28, అమరావతి వెలుగు : రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడంతోపాటు, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు అవకాశాలు పెంచేలా చర్యలు



చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో అగ్రిస్టాక్ కార్యక్రమం అమలు, డిజిటల్ వ్యవసాయ సమాచార సమీకరణపై జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ రంగానికి సంబంధించిన వివిధ శాఖల సమాచారాన్ని సమన్వయం చేసి, డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రాంతాల వారీగా, రైతుల వారీగా, పంటల వారీగా సమగ్ర వ్యవసాయ సమాచారాన్ని రూపొందించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవస్థీకృత రిటైలర్లతో రైతులను అనుసంధానం చేయడం ద్వారా వారు పండించిన ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్ అవకాశాలు కల్పించాలన్నారు. జిల్లాలో సాగు చేస్తున్న పప్పుధాన్యాలు, కూరగాయలు, పండ్లు, వేరుశనగకు మార్కెట్ సదుపాయాలు మెరుగుపరచాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెట్ అనుసంధానానికి ఉన్న అవకాశాలను గుర్తించి కార్యాచరణ రూపొందించాలన్నారు.

సమాచార సమీకరణతో మెరుగైన సేవలు... అగ్రిస్టాక్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు, అమలు విధానం, వ్యవసాయ రంగంలో దాని ఉపయోగాలు, రైతులకు కలిగే ప్రయోజనాలను జిల్లా వ్యవసాయ అధికారి వివరించారు. వ్యవసాయ సమాచార నాణ్యత, భూముల వివరాల అనుసంధానం, రైతుల గుర్తింపు, ప్రభుత్వ పథకాల అమలు, పంటల ప్రణాళిక, పంటల పర్యవేక్షణ, పంటల బీమా, వ్యవసాయ మార్కెటింగ్, రుణాలు, వ్యవసాయ గణాంకాలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. డిజిటల్ సమాచారాన్ని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వ్యవసాయ ప్రణాళికను మెరుగుపరచడంతోపాటు రైతులకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయవచ్చని పేర్కొన్నారు. అగ్రిస్టాక్ అమలులో వ్యవసాయ శాఖతోపాటు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని వాస్తవ వ్యవసాయ సమస్యలను గుర్తించి, అందుబాటులో ఉన్న సమాచారాన్ని ఆధారంగా చేసుకుని రైతులకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, ముఖ్య ప్రణాళిక అధికారి, లీడ్ బ్యాంకు మేనేజర్, ఐటీడీఏ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారి పి.సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, డీడీఏ, డీఆర్‌సీ వి.సుమలత, వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వినీత, సహాయ వ్యవసాయ సంచాలకులు డి.సుజాతతోపాటు జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు.

స్వామి ప్రేమ, శాంతి స్ఫూర్తితో పుట్టపర్తి అభివృద్ధికి కృషి చేస్తా..

పుట్టపర్తి: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ప్రేమ, శాంతి, మానవసేవా సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకొని పుట్టపర్తి



మున్సిపాలిటీని ఆధ్యాత్మిక శోభతో పాటు సుందర పట్టణంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని వైఎస్సార్‌సీపీ చైర్మన్ అభ్యర్థి బోయ వనం అవినాష్ పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసి, దేశవిదేశాల నుంచి వచ్చే సత్యసాయి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటానన్నారు. పట్టణంలోని చిత్రావతి రోడ్డులో 12, 13, 14 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన తరపున విస్తృతంగా ప్రచారం సాగింది. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసిన శ్రీధర్‌రెడ్డి.. యువకుడు, ఉత్సాహవంతుడైన అవినాష్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి



అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పుట్టపర్తి అభివృద్ధికి యువ నాయకత్వం అవసరమని, అవినాష్‌కు అవకాశం కల్పిస్తే పట్టణాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తారని తెలిపారు. స్థానికంగా జన్మించి, స్వామి విద్యాసంస్థల్లో విద్యనభ్యసించిన అవినాష్ మాట్లాడుతూ.. భగవాన్ సత్యసాయిబాబా బోధించిన 'మానవసేవే మాధవసేవ' సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసి, వారి అవసరాలకు అనుగుణంగా పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. పుట్టపర్తిని ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడేలా సుందరీకరించి, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తానన్నారు. భక్తులు, స్థానిక ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే తన




ప్రాధాన్యమని స్పష్టం చేశారు. తనకు అవకాశం కల్పించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శ్రీధర్‌రెడ్డి నాయకత్వంలో పుట్టపర్తి అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, ప్రజలు ఆశీర్వదించి తనను గెలిపించాలని అవినాష్ విజ్ఞప్తి చేశారు.

ఆరు జడ్పీటీసీలు, ఎంపీటీసీ...
స్థానాలన్నీ గెలుస్తాం

రాప్తాడు, అక్టోబరు 28, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల్లో రాప్తాడు నియోజకవర్గంలోని ఆరు జడ్పీటీసీ స్థానాలతోపాటు అన్ని ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకుంటామని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. రాప్తాడులోని నీలకంఠేశ్వరస్వామి,



పార్వతీ అమ్మవారు, షిరిడీ సాయినాథుని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆమె ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. రాప్తాడు మండల జడ్పీటీసీ అభ్యర్థి గుండ్లమడుగు జయలక్ష్మి, ఎంపీటీసీ అభ్యర్థి తలారి శివయ్యను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం అనంతపురం రూరల్ మండలంలోని చియ్యేడు, పూలకుంట, ఇటుకలపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ అభ్యర్థి మాధవి, ఎంపీటీసీ అభ్యర్థులు రాజప్పగారి నల్లమ్మ, ఎం.గోవింద్, శశికళలకు మద్దతుగా ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటికే 24 ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమయ్యాయని, ఇది విజయానికి తొలి అడుగని పేర్కొన్నారు. రాప్తాడులో రూ.5 కోట్లతో సీసీ రోడ్లు నిర్మించామని, పండమేరు వంకపై వంతెన, పార్కు, ప్రసన్నాయపల్లి నుంచి రాప్తాడు వరకు వంతెన నిర్మాణ పనులు చేపట్టామని వివరించారు. దెబ్బతిన్న రహదారి మరమ్మతులకు రూ.కోటి మంజూరు చేసి పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్హులకు పింఛన్లు, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఆరు జడ్పీటీసీ స్థానాల్లో ఐదింటిని మహిళలకు కేటాయించామని, బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలతోపాటు మహిళలకు ప్రాధాన్యమిస్తూ సామాజిక న్యాయానికి కట్టుబడ్డామని చెప్పారు. ప్రచారంలో భాగంగా పూలకుంటలో ఆర్టీసీ బస్సులోని ప్రయాణికులను కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో మహిళలు, ప్రజలు ఆమెకు స్వాగతం పలకగా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిరలో కాంగ్రెస్...
ఇంటింటి ప్రచారం

మడకశిర, అక్టోబరు28, అమరావతి వెలుగు : శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఆ పార్టీ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి వాల్మీకి సూరంగల్ నాగరాజుతో పాటు 3, 14వ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సభ్యుడు, మాజీ మంత్రి డాక్టర్ ఎన్. రఘువీరారెడ్డి బుధవారం పట్టణంలోని ఎస్సీ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఓటర్లను నేరుగా కలుసుకుని కాంగ్రెస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. మడకశిర పట్టణ సమగ్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని ఆయన పేర్కొన్నారు. చైర్మన్ అభ్యర్థి నాగరాజుతో పాటు 3, 14వ వార్డుల కౌన్సిలర్ అభ్యర్థులను హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో భాగంగా కాలనీవాసులు రఘువీరారెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆయా వార్డుల అభ్యర్థులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



రీ సర్వే సమస్యలను త్వరితగతిన...
పరిష్కరించాలి

అనంతపురం, అక్టోబరు 28, అమరావతి వెలుగు : జిల్లాలో భూముల రీ సర్వేకు సంబంధించి నెలకొన్న సమస్యలు, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని జాయింట్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రీ సర్వే పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా భూ రికార్డుల్లోని లోపాలు, పరిష్కరించాల్సిన పెండింగ్ సమస్యలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూ రికార్డుల్లో కచ్చితత్వాన్ని నిర్ధారిస్తూ, నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం రీ సర్వే ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏడీ సర్వే, ఎస్‌డీసీ, కేఆర్‌ఆర్‌సీ అధికారులు, సంబంధిత సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.



బీడుపల్లిలో ముమ్మరంగా కూటమి ప్రచారం







పుట్టపర్తి, అక్టోబరు 28, అమరావతి వెలుగు :

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని 24వ వార్డు బీడుపల్లిలో కూటమి చైర్మన్ అభ్యర్థి మేకల ఈశ్వర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు గాజు గ్లాసు గుర్తుపై, కౌన్సిలర్ అభ్యర్థులకు సైకిల్, కమలం, గాజు గ్లాసు గుర్తులపై ఓటు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం, పుట్టపర్తి మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మార్కెట్ యార్డు చైర్మన్ పూల శివప్రసాద్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డీఎస్పీ మాణిక్యరావు ఆధ్వర్యంలో...

పోలీసుల ఫ్లాగ్ మార్చ్







పుట్టపర్తి, అక్టోబరు 28, అమరావతి వెలుగు : మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ మాణిక్యరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో సీఐ యువరాజ్, పోలీసు సిబ్బంది బుధవారం పుట్టపర్తిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి గోపురం రోడ్డు, హనుమాన్ సర్కిల్, చిత్రావతి రోడ్డు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు కవాతు సాగింది. పుట్టపర్తి సబ్ డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటరూ ఎలాంటి భయం, ఒత్తిడికి గురికాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ సూచించారు. పట్టణంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఓడీసీ మండలంలో వైసీపీ...

విస్తృత ప్రచారం

ఓబులదేవరచెరువు, అక్టోబరు 28, అమరావతి వెలుగు : మండలవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు జెడ్పీటీసీ అభ్యర్థి మద్దే రాజు నాయుడు, ఎంపీటీసీ అభ్యర్థులతో కలిసి విస్తృత



ప్రచారం నిర్వహించారు. సున్నంపల్లి, తంగేడు గుంట, మామిళ్లకుంట్లపల్లి, కొండకమర్ల, డబురువారిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ.. 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1,500 ఇస్తామని హామీ ఇచ్చి రెండున్నరేళ్లు గడుస్తున్నా అమలు చేయలేదని, నిరుద్యోగ భృతి కల్పిస్తామని చెప్పి నిరుద్యోగులను నిరాశకు గురిచేశారని విమర్శించారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్లు ఇస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ, మహిళల రుణాల మాఫీతో పాటు సంక్షేమ పథకాలను అమలు చేసి ప్రజలకు ఆర్థికంగా అండగా నిలుస్తామని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు తమ తీర్పు ద్వారా ప్రస్తుత ప్రభుత్వానికి సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీపతి రెడ్డి, జెడ్పీటీసీ అభ్యర్థి మద్దే రాజు నాయుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ డీలర్ బయముతక శ్రీనివాసులు, రేపన రామాంజనేయులు, వలిపి ఆదినారాయణ, దామోదర్ రెడ్డి, రెడ్డిపల్లి ఆనందరెడ్డి, రామసుబ్బారెడ్డి, రఫీ, హరినాథ్ రెడ్డి, గొల్లపల్లి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వేళ ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు పోలీసుల సన్నద్ధం

అనంతపురం, అక్టోబరు28, అమరావతి వెలుగు : ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణ, అవాంఛనీయ ఘటనల నివారణే లక్ష్యంగా జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో మైన్స్ ప్రూఫ్ వాహనాన్ని జిల్లా ఎస్పీ పి.జగదీష్ పరిశీలించారు. వాహనం పనితీరు, సాంకేతిక పరిజ్ఞానం, అత్యవసర సమయాల్లో వినియోగించే విధానాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఎన్నికల సమయంలో గుంపులు, హింసాత్మక ఘటనలు ఎదురైనప్పుడు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతోపాటు పోలీసు సిబ్బంది భద్రతకు ఈ వాహనం ఉపయోగపడుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛగా జరిగేలా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వాహనాలు, పరికరాలను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలపై నిరంతర నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.నాగభూషణం, ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సీఐ క్రాంతికుమార్, ఆర్ఐలు పవన్‌కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థుల విజయానికి

సమష్టిగా పనిచేయాలి

గోరంట్ల, అక్టోబరు 28, అమరావతి వెలుగు : పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలంలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నేపథ్యంలో మంత్రి సవిత కూటమి నాయకులు, అభ్యర్థులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జనసేన పార్టీ జడ్పీటీసీ అభ్యర్థి, ఎంపీటీసీ అభ్యర్థులు, మండల కూటమి ముఖ్య నాయకులతో ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, అభ్యర్థుల విజయావకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి పొత్తులో భాగంగా గోరంట్ల మండల జడ్పీటీసీ స్థానాన్ని జనసేన పార్టీకి కేటాయించినట్లు తెలిపారు. అలాగే గోరంట్ల నాలుగో ఎంపీటీసీ స్థానాన్ని బీజేపీకి, మిగిలిన 21 ఎంపీటీసీ స్థానాలను తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లు వివరించారు. కూటమి అభ్యర్థులంతా సమన్వయంతో పనిచేస్తూ, నాయకులు, కార్యకర్తలను కలుపుకొని ప్రజల్లోకి వెళ్లాలని సూచించారు. ఎన్నికల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగుతూ, సమష్టి కృషితో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గోరంట్ల మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులు పాల్గొన్నారు.



పెనుకొండలో వైసీపీకి షాక్..

టీడీపీలో చేరిన కౌన్సిలర్ అభ్యర్థి

పెనుకొండ, అక్టోబరు 28, అమరావతి వెలుగు : పెనుకొండ మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీకి చెందిన 12వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గణేష్ (ఘన), మాజీ ఎంపీటీసీ మురళి తెలుగుదేశం పార్టీలో చేరారు. బుధవారం పెనుకొండలోని మంత్రి సవిత క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. మంత్రి సవిత వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గణేష్, మురళి మాట్లాడుతూ పెనుకొండ ప్రాంత అభివృద్ధి మంత్రి సవిత నాయకత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ప్రజల సంక్షేమం, ప్రాంత అభివృద్ధికి ప్రాధాన్యమిచ్చే నాయకత్వానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. తమ బలిజ సంఘం అభివృద్ధికి కూటమి ప్రభుత్వం రూ.2 కోట్లు కేటాయించడంపై మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు. పెనుకొండ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మంత్రి సవిత నాయకత్వంలో పనిచేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర కరువు బృందం పర్యటనకు పక్కాగా..

ఏర్పాట్లు చేయాలి

అనంతపురం, అక్టోబరు 28, అమరావతి వెలుగు : జిల్లాలో నవంబరు 1, 2 తేదీల్లో పర్యటించనున్న కేంద్ర కరువు బృందం (ఐఎంసీటీ) పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని డీఆర్ఓ ఏ. మలోల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం అనంతపురం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. నవంబరు 1న కేంద్ర బృందం జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని, 2న క్షేత్రస్థాయిలో కరువు పరిస్థితులను పరిశీలిస్తుందని డీఆర్ఓ తెలిపారు. పర్యటనకు సంబంధించి నిమిషం నిమిషానికి కార్యక్రమాన్ని రూపొందించాలని, క్షేత్రస్థాయి పరిశీలనకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, జిల్లాలో కరువు పరిస్థితులకు సంబంధించిన సమగ్ర వివరాలను సిద్ధం చేయాలని సూచించారు. ఖరీఫ్ 2026-27లో నెలకొన్న కరువు పరిస్థితులను వివరించేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, గ్రామీణ నీటి సరఫరా, ఐసీడీఎస్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేంద్ర బృందం పర్యటన ప్రాధాన్యాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వెంకట నారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి సాలు రెడ్డి, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె. శ్రీనివాసులు, హెచ్ఎల్‌సీ ఎస్ఈ సుధాకర్‌రావు, ఏపీఎంఐపీ ఏపీడీ చంద్రశేఖర్‌తో పాటు డ్వామా, ఐసీడీఎస్, పట్టు పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి

దుద్దుకుంట ప్రచారం

పుట్టపర్తి, అక్టోబరు 28, అమరావతి వెలుగు : పుట్టపర్తి మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల తరపున మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి







ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని చిత్రావతి రోడ్డు, చిత్రావతి గుట్ట ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి పార్టీ అభ్యర్థులకు మద్దతు కూడగట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. పార్టీ అభ్యర్థుల విజయానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో

పోలింగ్ కేంద్రాల తనిఖీలు

అనంతపురం, అక్టోబరు 28, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పోలీసులు బుధవారం క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ కేంద్రాల ఆవరణతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి, రాళ్లు, కట్టెలు, డబ్బాలు, ఇతర ప్రమాదకర వస్తువులు ఉంటే తొలగించేలా చర్యలు తీసుకున్నారు. పోలింగ్ రోజు ఎన్నికల సిబ్బందికి ఇబ్బందులు తలెత్తకుండా కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించారు. లైట్లు, ఫ్యాన్లు, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల సౌకర్యాలను తనిఖీ చేశారు. ఏవైనా సమస్యలు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే పరిష్కరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.



ఏకగ్రీవ ఎంపీటీసీలకు పరిటాల సునీత అభినందనలు

అనంతపురం, అక్టోబరు 28, అమరావతి వెలుగు : రాప్తాడు నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీటీసీలు బుధవారం అనంతపురంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. రామగిరి మండలం కుంటిమద్ది ఎంపీటీసీ మజ్జిగ సుకన్య, ఆత్మకూరు మండలం ముట్టాల ఎంపీటీసీ గీతారాణి, సింగంపల్లి ఎంపీటీసీ గోవింద్ నాయక్‌లను ఎమ్మెల్యే అభినందించారు. తమ విజయానికి సహకరించినందుకు, తమపై నమ్మకం ఉంచినందుకు వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నికైన ఎంపీటీసీలను శాలువాలతో సత్కరించారు. నియోజకవర్గంలో ఇప్పటికే 24కు పైగా ఎంపీటీసీ స్థానాలు ఏకగ్రీవమైనట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిరంతరం వారికి అందుబాటులో ఉండాలని, గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ పారదర్శకంగా సేవలందించాలని ఆమె పిలుపునిచ్చారు.



మహమ్మదాబాద్ క్రాస్‌లో టీడీపీకి షాక్..

వైసీపీలో చేరిన సీనియర్ నేతలు

పుట్టపర్తి, అక్టోబరు 28, అమరావతి వెలుగు : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. మహమ్మదాబాద్ క్రాస్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు వెంకటరమణ, తిరుపాలు తెలుగుదేశం పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. మహమ్మదాబాద్ క్రాస్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి.



గత ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతోపాటు, మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి హయాంలో నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేప థ్యంలో ఈ చేరికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బి. యముతక శ్రీనివాసులు, రేపన రామాంజనేయులు, హరినాథ్‌రెడ్డి, ఎస్. చంద్రశేఖర్, కే. చంద్రశేఖర్, నంది నరసింహులు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by : JANAPATI VENKATA RAMESH BABU, #1-1189-21A, NGO Colony, KADIRI - 515591, Anantapuramu (Dist.), AP (State) and Printed at M/s AK PUBLICATIONS, #1-1189-2A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist), AP (State) and Published at #1-1189-21A, NGO Colony, Kadiri - 515591, Anantapuramu (Dist.), (A.P), Editor : JANAPATI VENKATA RAMESH BABU, RNI No. APTEL / 2022 / 85169, E-mail : amaravathivelugu@gmail.com, Cell: 9440814576